


ఎర్రగడ్డలో ఒక సవారీ దించగానే ఆటో డ్రయివర్ వెంటనే మరో సవారీ దొరకడం తన అదృష్టంగా భావించాడు ఆటో కోసం ఎదురు చూస్తున్న దాదాపు ఓ నలభై ఏళ్లతను కంగారుగా ఆటో ఎక్కి "త్వరగా పోనీ" అన్నాడు

"కహ జానా ? అడిగాడు ఆటో డ్రయివర్ హిందీలో-ఫ్లేగ్ దింపి

"లక్‌డీ కా పూల్" చెప్పాడతను ఆదుర్దాగా ఆటో కొద్దిదూరం వెళ్ళ గానే "ఓసారి ఆ మందులషాపుదగ్గర ఆపు" అని కోరాడు ఆ ప్రయాణీకుడు వెనకసీట్‌లోంచి

ఆటో ఆగగానే, ఆ మందుఃషాపు లోకి నడిచివెళ్ళి, ఆ షాపతన్ని ఏదో అడిగాడు ఆ మందులషాపతను తమ దగ్గర లేదన్నట్లుగా తల అడ్డంగా వూపాడు మళ్ళీ వచ్చి ఆటోలో కూర్చుని ఆ ప్రయాణీకుడు "పోనీ" అన్నాడు

ఆటో లక్‌డీ కా పూల్ చేరుకునే లోపల అలా అయిదారుచోట్ల అతను ఆటోని ఆపించి మందులషాపుల్లోకి వెళ్ళి ఏదో అడుగుతూనే వున్నాడు ఆ షాపులవాళ్ళు లేదని తల అడ్డంగా వూపడమో చెప్పటమో జరిగాక అతను వచ్చి ఆటోలో కూర్చుంటు న్నాడు అతనిలోని ఆదుర్దా అలా తిరిగి వచ్చిన ప్రతీసారి అధికంకావడం గమనిస్తూనే వున్నాడు ఆటో డ్రయివర్

ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఎవరికో సీరియస్‌గా వుండి వుంటుందని మందు కోసం ప్రయత్నిస్తున్నాడని వూహిం చాడు డ్రయివర్ ఆటో లక్‌డీ కా పూల్ చేరుకోగానే ఓ పెద్ద మందుల షాపు ముందు ఆపించి దిగి, దాంట్లోకి వెళ్ళాడు ఆ ప్రయాణీకుడు మళ్ళీ ఏదో అడిగాడు

పది పదిహేను క్షణాల తర్వాత వెనక్కి వచ్చి ఆటోలో కూర్చున్నా డతను చిన్నబోయిన వదనంతో

నాలుగైదు నిముషాలదాకా మాట్లాడ కుండా, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడతను

"అభీ కహా జానా ?" అడిగాడు డ్రయివర్

"వెనక్కి" అన్నాడతను పెద్దగా నిట్టూర్చి

ఆటోని మళ్ళీ ఎర్రగడ్డవైపు పోనిచ్చాడు డ్రయివర్ దారిలో ఇదివరకు అడగని ఒక మందులషాపుముందు ఆపి, చెప్పాడు డ్రయివర్ ఆ ప్రయాణీ కుడితో అందులో దొరుకుతుందేమో ప్రయత్నించమని

అతను ఆ మందులషాపులోకి వెళ్ళి, వెంటనే తిరిగి వచ్చేసాడు

"ఛత్ ఎక్కడా దొరకదులావుంది" అన్నాడు తనలో తను గొణుక్కుం టున్నట్లుగా

ఆటో ఎర్రగడ్డ ఆస్పత్రిముందు ఆగగానే అతను కిందకి దిగి, గబగబా గేటువైపు నడిచాడు

"సాబ్ ఆటో ఫేర్ ఏడు రూపా యల చిల్లరయింది" అరిచాడు డ్రయి వర్ కూడా ఆటో దిగి ఆగి, జేబులు తడుముకుని అన్నాడా ప్రయాణీకుడు దీనంగా

"లేదు నిన్న రాత్రి మా నాన్న గారితో డాక్టర్ అంటూంటే విన్నాను, మీ వాడు ఇరవై సంవత్సరాలనుంచి వుద్యోగం దొరకకపోవటంవల్ల పాడ యాడు ఉద్యోగమే సరయినమందు" అని ఎక్కడైనా ఆ మందు దొరకు తుందేమోనని ప్రయత్నంచేసాను నువ్వే మాసావుగా దొరకలేదు ఆ సంగతి డాక్టర్‌తో చెప్పాలి ఆయనకే పిచ్చి నిజానికి అయినా వప్పుకోడు చస్తే"

ఆస్పత్రి గేటువైపు మళ్ళీ దబదబా అడుగులు వేసాడతను

ఆ ఆస్పత్రి పేరు "గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ డిసీజెస్

తెలుగులో దాన్ని 'పిచ్చాసుపత్రి' అంటారు